# కులాసా రాదోయ్ రమ్మంటే...

సుగుణ

(గత సంచిక తరువాయి)

"అలాంటిది, రెండేళ్లై, నాలో ఎప్పట్నించో అణగిపోయిన లిబిడో అంతా పైకి లాగిందీ మనిషి. నా కాలేజ్ స్థాపించడానికి సాయపడి, 'విశారద' అన్న పేరు కూడా సూచించింది."

"అప్పుడేర్పడిన పరిచయం, అనుకోకుండా ఇలా క్లోజ్‌నెస్‌గా మారింది. ఆవిడ ఇదివరకే భర్త నించి విడాకులు పొందింది. సోషల్ బేరియర్స్ అంటూ లేకపోయినా, చాలా డిగ్నిఫైడ్‌గా వ్యవహరిస్తుంది. ఇక నా సంగతికొస్తే, నాకు నేనై ఏర్పరచుకున్న నిబంధనలన్నీ ఆవిడ సాహచర్యంలో పూర్తిగా మాయమైపోయాయి. అయినా, మా ఈ సంబంధాలన్నీ జాగ్రత్తగా కాపాడుకుంటాం, ఎవరికీ తెలియనీయకుండా, ఫర్ అవర్ ఓన్ రీజన్స్."

"నాకిప్పుడు అరవై ఎనిమిది. నీ కన్నా రెండు-మూడేళ్లు పెద్ద అనుకుంటా. ఈ వయసులో ఈ రకం ఆలోచనలేమిటి, కృష్ణా రామా, అని పడి ఉండక? అనే టైపు ఇక్కడి నా ఫియర్స్. వాళ్ల నడిగే పరిస్థితి కాదు. అమెరికాలో నీ భార్య పోయాక నువ్వేం ఏర్పాట్లు చేసుకున్నావో నాకు తెలియదు. కానీ 'మేకింగ్ లవ్' అన్నది నా జీవితంలో ఒక ముఖ్యభాగమై పోయిందిప్పుడు. ఈ ఎబిలిటీ, ఫిట్‌నెస్, ఆరోగ్యం, ఇవన్నీ, ఈ రెండేళ్ల యాక్టివ్ లవ్ లైఫ్ ఫలితాలే. నా బాడీని చూసుకుంటే నాకే ఆశ్చర్యంగా ఉంటుంది, దీనికంత కెపాసిటీ వుందా-అని."

"ఆపరేషన్ తరువాత కంట్రోల్‌లోనే ఉన్నాం, మేమిద్దరమూనూ. కానీ ఈ మధ్యే కదలికలు మొదలయ్యాయి. ఏం చెయ్యాలో, ఏది కూడదో, నువ్వు చెప్తావని ఈ మీటింగ్" అని ముగించాడు రత్నాకర్.

వాడి ఆనెస్టీకి ముచ్చటేసింది నాకు. మర్నాడు క్లినిక్‌లో అమెరికా నుంచి అప్పుడే దిగుమతైన ఎక్విప్‌మెంట్‌తో కొన్ని టెస్టులు చేసి, 'పర్‌ఫెక్ట్ హార్ట్' అని రత్నాకర్‌ని సర్టిఫై చేసేశాను. "గో ఎహెడ్" అన్నప్పుడు వాడి ముఖంలో వెలుగు చూసి, వీడి జీవితం ఇంత కాంతిమయం చేసిన వనితాశిరోమణి ఎవరా, ఒకసారి కలిస్తే బాగుండును-అనుకున్నా. ఆ సంఘటన త్వరలోనే నాకెదురైంది.

హాస్పిటల్ ఓపెనింగ్, పబ్లిసిటీ, అంతా మిన్నీకే అప్పజెప్పేశాను. దాని మేధ చూస్తే, దీన్నేగా అన్ని మొట్టికాయలు వేశానూ—అనిపించింది.

హాస్పిటల్‌కి మిన్నీ ఒక అమోఘమైన పేరు పెట్టింది. స్టేట్స్‌లో అంతా నన్ను సులువు కోసం 'డాక్టర్ జో' అనేవారు. మిన్నీ దాన్ని 'జోస్' అనిపెట్టి, ఆఖర్ని కేపిటల్ 'హెచ్' (ఫోర్ హార్ట్ అన్నట్లు) కలిపింది. అంతా ఒక పదంగా చదివితే 'జోష్' అని పలికింది. అంటే హిందీలో హుషారు, జల్సా అని అర్థం. ఓపెనింగ్‌కి హెల్త్ మినిస్టర్ని పిలిచి, మిన్నీ ప్రోటోకాల్ అదీ కూడా చాలా బాగా మేనేజ్ చేసింది. ప్రార్థనగీతం 'జ్యోతి కలశ్ ఛల్‌కే' అని ఎవరో అమ్మాయి స్టేజి వెనక నుండి పాడింది. ఎవరా నన్నిలా హ్యామర్ చేస్తున్నారూ



అనుకుంటుంటే, ఆఖరి చరణం పాడుతూ రత్నాకర్ స్టేజి మీద కొచ్చాడు, మైకు పట్టుకుని. వాడి లతా వాయిస్ అనుకరణకి అంతా చప్పట్ల వర్షం కురిపించేశారు.

స్పీచ్‌లూ, అవీ అయి, మినిస్టరు వెళ్లిపోయాక, రత్నాకర్ మళ్లీ స్టేజీ మీదకొచ్చి, "ఇప్పుడు 'జోష్' హాస్పిటల్ థీమ్ సాంగ్ ప్రెజెంట్ చేస్తున్నాం. గివ్ ఎ బిగ్ హేండ్ టు ది సింగర్" అని ఎనౌన్స్ చేసి, వింగ్స్‌లోకి చేయి జాపాడు. తెల్లటి పట్టుచీర కట్టుకుని, రత్నాల సెట్టు పెట్టుకుని, ధగధగ మెరిసిపోతూ మిన్నీ స్టేజీ మీదకొచ్చింది. నేను గుడ్లప్పగించి అలా చూస్తుండిపోయాను.

రత్నాకర్ మైకు దానికిచ్చి పక్కన నిలబడ్డాడు.

మొదలెట్టింది మిన్నీ.

**"కులాసా రాదోయ్ రమ్మంటే**
**మజాకా కాదోయ్ వలపంటే**
**ఖలేజా అంటూ వుండాలో...య్**
**రాజా!**
**అదుంటే ఎపుడూ నిన్నూ**
**ఎడబాయనోయ్"**

అదంత బాగా పాడగలదని అప్పుడు తెలిసింది నాకు. ఆడియన్స్‌తో పాటు నేను కూడా లేచిపోయి, చప్పట్లు కొడుతూ ఈలలు వేస్తూ డాన్స్ చేసేశాను.

మిన్నీ నవ్వుతూ అందరి పక్కా చూస్తుంటే, ఆడియన్స్‌లో ప్రతి మగాడూ, చిన్నా, పెద్దా తేడా లేకుండా, ఆ పాట తననుద్దేశించే పాడుతోందనుకున్నాడంటే అతిశయోక్తి కాదు. మధ్యలో మిన్నీ, "రాజా..." అని నొక్కి పలికి రత్నాకర్ వేపు చూసింది. రత్నాకర్ చిన్న నవ్వు నవ్వాడు. ఆ క్షణాన నాకంతా అర్థమయిపోయింది.

ఈలలూ, అవీ సద్దుమణిగాక, నేనూ స్టేజి మీద కెక్కిపోయాను, ఉత్సాహంగా. మైకు తీసుకుని, "బావా ఎప్పుడు వచ్చితీవు" అని శ్రీకృష్ణ రాయబారంలోని పద్యం, రఘురామయ్య గొంతులో అందుకున్నాను. స్టేట్స్‌లో, కమల పోయాక, తెలుగు పౌరాణిక

నాటకాలేస్తూనే గడిపేవాడిని. అదే నా 'ఏర్పాటు!' అంతా చప్పట్లు కొడుతూంటే, మిన్నీనొక చేత్తోనూ, రత్నాకర్‌నొక చేత్తోనూ చుట్టేసి నిలబడి, ఇంత కన్నా జీవితంలో సంతోషం ఏముంటుంది, అనుకున్నాను.

మిన్నీ సాహచర్యంలో రత్నాకర్‌కీ, దాని పాటలోని సందేశాన్ని సరిగా అర్థం చేసుకున్న వాళ్లకీ, నా అవసరం పెద్దగా పడలేదు. కానీ, జీవితంలోని సారాన్ని అతిగా జుర్రేసుకుందామన్న కొందరు మాత్రం, నా దగ్గరకి వస్తూనే వున్నారు. వాళ్లకి నా అనుభవంతోనూ, ఆధునికపరికరాల ద్వారానూ ట్రీట్‌మెంట్ ఇస్తూనే వచ్చాను.

ఇలా జరుగుతుండగా...

ఒక రోజు ఛేంబర్‌లో కూర్చున్నాను. జూనియర్ డాక్టర్ సుమంత్, తలుపు తోసుకొని లోపలికి వచ్చాడు, నాక్ చేయడం కూడా మరిచిపోయి, "సర్, ఎమర్జెన్సీ! సివియర్ ఎటాక్, రెండోదిట. పేషెంటు చాలా డిస్ట్రెస్‌లో వున్నాడు" అన్నాడు గాభరాగా.

ఐ.సీ.యులో అన్నీ సిద్ధం చేయమని, పేషెంటు స్ట్రెచరు వైపు గబగబా పరిగెట్టాను.

కొడుకు కాబోలు, "ప్లీజ్ సేవ్ హిమ్ డాక్టర్!" అంటున్నాడు, సుమంత్‌తో.

"వీ విల్ డూ అవర్ బెస్ట్" అని అతని భుజం తట్టి, లోపలికి వెళ్లిపోయాను.

కేస్ షీట్‌లో 'శశాంక్‌చతుర్వేదీ' అనుంది. ట్రీట్‌మెంట్ పూర్తి చేసి, పైకొచ్చి, "చరణ్!" అని పిలిచాను. కారిడార్లో పచార్లు ఆపి, నా వంక ఆశ్చర్యంగా చూశాడు. నా పరిచయం చేసుకుని, అసలేమైందో చెప్పమన్నాను.

తల వంచుకుని, కొంచెం సిగ్గుతో చెప్పాడు. క్రిస్‌మస్ హాలిడేస్ తండ్రితో గడపడానికి వచ్చాడుట. వాళ్ల డాడీ, మాయా ఆంటీతో బెడ్ రూంలో వుండగా ఎటాక్ వచ్చిందట. "హౌ ఈజ్ హిజ్ కండిషన్?" అనడిగాడు చరణ్ ఆదుర్దాగా.



"హీ విల్ పుల్ త్రూ దిస్ టైమ్, కాని ఇక మీదట జాగ్రత్తగా వుండాలి. యూనో వాట్ ఐ మీన్!" అన్నాను.

"డాడీకి చెప్పడానికి ప్రయత్నం చేస్తాను. కాని ఎవరి మాటా వినడు. ఆంటీ అంటే అబ్సెషన్. ఆవిడ్ని ప్లీజ్ చేయడానికీ, యంగ్‌గా కనిపంచడానికీ, ఏవేవో చేస్తుంటాడు. ఆంటీ ఇతని వీక్‌నెస్ కనిపెట్టి ఒక ఆటాడిస్తూ వుంటుంది. మొన్ననే విన్నాను, 'శష, యూ హేవ్ గాన్ టూ ఓల్డ్ యార్', అంటూంటే, దాంతో డాడీ ఇలా...," అని చరణ్ కళ్లమ్మట నీళ్లు పెట్టేసుకున్నాడు.

"మమ్మీకి ఎలా చెప్పాలో తెలియడం లేదు" అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

"నేను చెప్తాలే" అని వాడిని సమాధానపరచి ఇంటికి పంపేశాను. కాని మిన్నీకి ఈ వివరాలన్నీ చెప్పి దాని సంతోషమయజీవితంలో కలత కలిగించడం నాకిష్టం లేకపోయింది. అదీ గాక, చరణ్ విషయంలో మిన్నీ భయాలేవీ నిజం కాలేదు. వాడు తండ్రిని మెచ్యూరిటీతో హాండిల్ చేస్తున్నాడనే చెప్పుకోవాలి.

ప్లెజర్ సీకింగ్ ఒకటే జీవితపరమార్థం అనుకునే శశాంక్ లాటి వాళ్లకి ఆ ప్లెజర్ అందినట్లే అంది, ఇట్టే దూరమై, ఇటువంటి పెయిన్‌ఫుల్ పరిస్థితులు కల్పిస్తూ వుంటుంది.

అదే రతన్ విషయం తీసుకుంటే, ఆ పరిస్థితులే తారుమారయ్యాయి. అతను తీసుకున్న నిర్ణయాలన్నీ ఓర్పుతోనూ, సహృదయతతోనూ తీసుకున్నవీ, ఇతరులకు ఏ మాత్రం హానీ చేయనివీను. డబ్బయ్యోపడి దగ్గరవుతున్న సమయంలో, సౌఖ్యం అతన్ని వెదుక్కుంటూ వచ్చింది, మిన్నీ రూపంలో. అతని యూత్‌ఫుల్‌నెస్, విగర్, వైటాలిటీ, ఇవన్నీ మిన్నీ ప్రేమ లోంచి పుట్టినవే కానీ, 'వయాగ్రా'ల వల్ల కాదు. ఆ మిన్నీయే శశాంక్‌కి పనికి రాలేదు. పనికొచ్చిందనుకున్న మాయా, అసలు విషయానికి వచ్చేటప్పటికి 'ఛీ' కొట్టింది.

రాత్రి ఇవన్నీ నెమరేసుకుంటుంటే నాకేమనిపించిందంటే...

సౌఖ్యం ఒక తళతళ మెరిసే తటాకం లాంటింది. అందులోకి తొంగి చూస్తే మన మనఃఫలకం కనిపిస్తుంది. మన జీవిత దృశ్యాలన్నీ ఆ ఫలకం మీద స్వచ్ఛంగా ప్రతిబింబిస్తే, మన మనసు నిర్మలంగా వున్నట్లే.

ఇతరుల సుఖం గురించి ఆలోచించే హృదయాలు, ఎప్పుడూ సంతోషంగానే వుంటాయి. వాటిని ఏ రోగమూ అంటదు.

ఖలేజాలన్నీ కులాసాగా వుంటే, నా వంటి వాళ్ల హై టెక్ హాస్పిటల్స్ ఎప్పుడూ ఖాళీయే. నాక్కావలసింది కూడా అదేనని నేను చెప్తే, మీరు నమ్మాల్సిందే!

(సమాప్తం)